క్లుప్తంగా

త్రినాథ్‌కు అదీప్‌రాజ్ పరామర్శ



కేసుబోయిన త్రినాథ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: ఇటీవల జనసేన నాయకుల చేతిలో దాడికి గురై, తీవ్రంగా గాయపడ్డ పెదగాడి సర్పంచ్ కేసుబోయిన లావణ్య భర్త, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కేసుబోయిన త్రినాథ్‌ను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం పరామర్శించారు. పెదగాడిలోని త్రినాథ్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు గొరపల్లి శ్రీను, బొడ్డపల్లి హేమంత్, రాపర్తి మాధవరావు ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కేసుల నమోదు



బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తులను పట్టుకున్న పోలీసులు


పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్, నరవ, సత్తివానిపాలెం, వేపగుంట ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న పలువురి వ్యక్తులపై పోలీసులు ఆదివారం కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యపానంతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్న సమాచారంతో పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో అనేక ప్రాంతాల్లో సీఐ కె.వి.సతీష్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్ చిత్రాల ఆధారంగా నిందితులను గుర్తించారు. పలువురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు బహిరంగంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

6న ఈ.బోనంగి వెంకన్న గిరి ప్రదక్షిణ



పరవాడ: మండలంలోని ఈ.బోనంగి దరి కొండపై కొలువైన భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలిసారిగా వచ్చే నెల 6న గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామగోవిందరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గిరి ప్రదక్షిణ ఆ రోజు స్వామి వారి ఆలయం నుంచి ప్రారంభమై గౌతుల చ్చన్ననగర్, సబ్‌స్టేషన్ కూడలి మీదుగా తహసీల్దార్ కార్యాలయం, ఆంజనేయస్వామి ఆలయం, బీకే స్టీల్ పరిశ్రమ, ఫార్మాసిటీ కాలనీల మీదుగా వెంకన్న ఆలయానికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.


తీరప్రాంతాల్లో సండే సందడి



ముత్యాలమ్మపాలెం తీరంలో జలకాలాడుతున్న సందర్శకులు

పరవాడ: ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో సందడిగా మారాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు తీర ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ వంటి ఆట పాటలతో సందడి చేశారు. తీరం వెంబడి ద్విచక్ర వాహనాలను పరుగులు తీయించి సరదాగా గడిపారు. సాయంత్రం వరకు తీరంలో జలకాలాడుతూ సందడి చేశారు.

రౌడీ షీటర్లపై నిరంతర నిఘా



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ స్వామినాయుడు

పెందుర్తి: సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామని సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ స్వామినాయుడు అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని రౌడీ షీటర్లను హెచ్చరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చెడు ప్రవర్తన వలన వారి కుటుంబాలు సమాజంలో చిన్న చూపునకు గురవుతాయని పేర్కొన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్టు పోలీసుల దృష్టికి వస్తే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. మంచి నడవడికతో ఉంటే రౌడీ షీట్లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని వివరించారు. పలు సూచనలు చేశారు. ఏఎస్‌ఐ కాశీప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక చదువు.. కొలువుల నెలవు

- అత్యాధునిక సౌకర్యాలతో పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాల
- అత్యుత్తమ పాలిటెక్నిక్ కళాశాలగా ఎంపికతో మరింత ఆదరణ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కళాశాలకు మహర్దశ
- గతేడాది రికార్డు స్థాయిలో 229 మందికి కొలువులు
- ఈ ఏడాది నాలుగు కోర్సుల్లో 264 సీట్ల భర్తీకి రంగం సిద్ధం

సాంకేతిక విద్య కొత్త పుంతలు తొక్కుతోంది. సాధారణ డిగ్రీల కంటే నైపుణ్యాలతో కూడిన పాలిటెక్నిక్ విద్యవైపు విద్యార్థుల, తల్లిదండ్రుల ఆసక్తి పెరుగుతోంది. కళాశాలలో కాస్త వసతులుంటే చాలు.. ఇంజినీరింగ్ కంటే వీటివైపే మొగ్గు ఎక్కువ. అలాంటి వాటిలో పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ముందంజలో ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చొరవతో వసతుల లేమి నుంచి రాష్ట్రంలోనే అత్యుత్తమ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలగా ఎదిగింది.



పెందుర్తిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల



తాజాగా విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న సిబ్బంది

పెందుర్తి: సాంకేతిక విద్యలో తమకు ఆసక్తి ఉన్న బ్రాంచ్‌లో తర్ఫీదు పొందితే పరిశ్రమలు చక్కటి అవకాశాలతో ఆహ్వానం పలుకుతున్నాయి. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు అందుతున్నాయి. అత్యుత్తమ శిక్షణ అందించేందుకు తగినంత మంది అధ్యాపకులు/శిక్షకులు అందుబాటులో ఉన్నారు. పేరొందిన ప్రైవేట్ సంస్థలు కూడా ఇతోధికంగా సాయపడుతుండటంతో కళాశాలలో డిప్లొమా కోసం అడుగు పెట్టిన విద్యార్థులు చేతిలో అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో బయటకు వెళుతున్నారు. అందుకే పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాల రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ కళాశాలగా ఎంపికైంది. ఈ నేపథ్యంలో కళాశాలలో చేరేందుకు ఉమ్మడి జిల్లాలోని పాలిసెట్ అభ్యర్థులు తమ ప్రథమ ప్రాధాన్యతగా పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలను ఎంచుకునేందుకు సిద్ధమయ్యారు.



కళాశాల ల్యాబ్‌లో కంప్యూటర్ హార్డ్‌వేర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దశ తిరిగింది

కళాశాలను రూ.9.7 కోట్లతో 22 గదులతో 2018లో ప్రారంభించారు. సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ బ్రాంచ్‌లు ఉండగా ఒక్కో బ్రాంచ్‌కు 60 సీట్లు కేటాయించారు. బ్రాంచ్‌కు మరో 6 సీట్లు అదనం. దీంతో మొత్తం 264 మంది ఏటా కొత్తగా చేరుతున్నారు. తొలినాళ్లలో సౌకర్యాల లేమితో కళాశాలలో చేరేందుకు విద్యార్థులు పెద్దగా ఆసక్తి కనబరిచేవారు కాదు. 2020–21 నుంచి కళాశాల దశ తిరిగింది. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాంకేతిక విద్యపై అదనపు శ్రద్ధ పెట్టడంతో ఈ కళాశాలకు రూ.8 కోట్ల నిధులు వచ్చాయి. దీంతో ఇక్కడ 20 గదులతో అదనపు భవనాన్ని నిర్మించారు. అదే సమయంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ బోర్డు స్కిల్ హబ్‌ను కూడా ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి కళాశాల దశ మారిపోయింది.



స్కిల్ హబ్‌లో హ్యాండ్ ఎంబ్రాయిడరీ శిక్షణ పొందుతున్న మహిళలు

అన్ని సౌకర్యాల ఏర్పాటే లక్ష్యం



సాంకేతిక రంగంలో రోజురోజుకూ అవకాశాలు మెరుగవుతున్నాయి. ఈ క్రమంలో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపునకు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. నాలుగైదేళ్లుగా ఆ దిశగా విజయవంతమైన అడుగులు వేశాం. ప్రస్తుతం కళాశాలలో కావాల్సిన అన్ని సదుపాయాలూ ఉన్నాయి. మరిన్ని అదనపు సౌకర్యాలకు ప్రయత్నిస్తున్నాం. గత విద్యా సంవత్సరంలో భారీగా విద్యార్థులు కొలువులు సాధించడం సంతోషం. రానున్న రోజుల్లో ఈ రికార్డును మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తాం. ప్రస్తుతం పాలిసెట్ ర్యాంకర్ల ధ్రువపత్రాల పరిశీలన జరుగుతోంది. వెబ్ ఆప్షన్ల ప్రక్రియ గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు క్షుణ్ణంగా వివరిస్తున్నాం.

– డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పెందుర్తి

వసతుల లేమి నుంచి తేరుకుని ప్రస్తుతం రాష్ట్రంలోని అత్యున్నత కళాశాలగా నిలిచింది.

పెరుగుతున్న ఉపాధి!

మూడేళ్ల కోర్సులు ఉన్న ఈ కళాశాలలో చేరిన వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయి. 2018–21లో 13 మంది క్యాంపస్ నుంచి ఉద్యోగాలు పొందగా, 2019–22కు ఆ సంఖ్య 24కు పెరిగింది. తాజాగా కళాశాలలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లు సత్ఫలితాలిస్తున్నాయి. విద్యార్థులు సాంకేతిక అంశాలపై గట్టి పట్టు సాధిస్తున్నారు. దీంతో ఈ ఏడాది క్యాంపస్ నుంచి రికార్డు స్థాయిలో 229 మంది ప్రముఖ సంస్థల్లో ఉపాధి పొందారు.

ప్రైవేట్ సంస్థల తోడ్పాటు

- 2021లో గంగవరం పోర్టు యాజమాన్యం సీఎస్ఆర్ నిధులు రూ.37 లక్షలు వెచ్చించి పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయలు కల్పించింది.
- విద్యార్థుల్లోని సాంకేతిక ప్రతిభను మెరుగుపరిచేందుకు 'మై యాక్సస్'సంస్థ రూ.15 లక్షలతో అత్యాధునిక ల్యాబ్‌ను ఏర్పాటు చేసి శిక్షణ అందిస్తోంది.
- లోటస్ వైర్‌లెస్ టెక్నాలజీస్ సంస్థ రూ.35 లక్షలతో అన్ని సౌకార్యలతో ల్యాబ్‌ను ఏర్పాటు చేసి, తర్ఫీదునిచ్చి ఉపాధి అవకాశాలను నిరంతరం మెరుగుపరుస్తోంది.
- రాయల్ ఎలక్ట్రిక్ వెహికల్ సంస్థ రూ.6 లక్షలతో ల్యాబ్ సామగ్రి సమకూర్చి విద్యుత్ వాహనాల మెకానిజం, ఇతర అంశాలపై విద్యార్థులకు తగిన శిక్షణ అందిస్తోంది.
- దీంతోపాటు స్కిల్ హబ్‌లో నిరుద్యోగులకు వెల్డింగ్, మహిళలకు హ్యాండ్ ఎంబ్రాయిడరీ(బ్యాచ్‌కు 30 మంది చొప్పున మూడు నెలల కోర్సు)లో శిక్షణ ఇచ్చి, స్వయం ఉపాధికి సహకారం అందిస్తోంది.

ప్రజా సమస్యలపై పోరాటం ఉధృతం



రాంపురంలోని కార్యాలయంలో అర్బన్, రూరల్ పార్టీ నాయకులతో అదీప్‌రాజ్

పెందుర్తి: కూటమి ప్రభుత్వంలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిపై పోరాటాన్ని ఉధృతం చేసేందుకు అంతా సన్నద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాంపురంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పెందుర్తి మండల అర్బన్, రూరల్ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిన తీరును క్షేత్రస్థాయిలో ఎండగట్టాలన్నారు. వచ్చేనెల 2న సబ్బవరం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు చొప్పా నాగరాజు, మధుపాడ అంజి, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, యతిరాజుల నాగేశ్వరరావు, గొరపల్లి శ్రీను, బొడ్డపల్లి హేమంత్, మెంటి మహేష్, దాసరి సత్తిబాబు, బండి సత్తిబాబు, తామర్ల నర్సింగ్, రాపర్తి మాధవరావు, చందుయాదవ్, దాడి నూకరాజు, వంగలపూడి గణేష్, పట్నాల లక్ష్మణ్, చంద్రు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డవాగులో అక్రమ కల్వర్టు తొలగింపు



వెదుళ్లనరవ గెడ్డవాగులో నిర్మిస్తున్న కల్వర్టును పొక్లెయిన్‌తో తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: మండలంలోని జీవీఎంసీ పరిధి వెదుళ్లనరవలో ప్రభుత్వ భూమి గెడ్డవాగులో అక్రమంగా నిర్మించిన కల్వర్టును రెవెన్యూ సిబ్బంది యంత్రాల సాయంతో ఆదివారం తొలగించారు. వెదుళ్లనరవ రెవెన్యూ పరిధి సర్వే నెం.94లో ప్రభుత్వ భూమి గెడ్డవాగులో కల్వర్టును నిర్మించారు. తహసీల్దార్ చిన్నికృష్ణ ఆదేశాల మేరకు ఆర్ఐ వీరయ్య, సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గెడ్డవాగులపై కల్వర్టుల నిర్మాణానికి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అనుమతులు తప్పనిసరన్నారు. అనుమతుల్లేకుండా అక్రమంగా కల్వర్టులు నిర్మించడం నేరమని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు కల్వర్టులు అవసరమైతే ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆక్రమణలను తొలగించినవారిలో ఆర్ఐతో పాటు వీర్వో రాంబాబు తదితరులు ఉన్నారు.

చిత్తడి రోడ్లతో వాహనదారుల వెతలు



బురదమయంగా మారిన బొట్టవానిపాలెం–నునపర్తి రోడ్డు



చిత్తడిగా మారిన ఎన్టీపీసీ–బొట్టవానిపాలెం రోడ్డు

పరవాడ: అడపాదడపా కురుస్తున్న వర్షాలకు మండలంలోని రోడ్లు బురదమయంగా మారాయి. రావాడ గ్రామ పంచాయతీలో పలు రహదారులు మరీ అధ్వాన స్థితికి చేరడంతో గ్రామీణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా బొట్టవానిపాలెం–నునపర్తి గ్రామాల మధ్య రహదారి చిత్తడిగా మారింది. గొల్లగరువు వద్ద రోడ్డు గోతులమయంగా మారడంతో ఇటీవల చెరువు మట్టితో తాత్కాలికంగా పూడ్చారు. తాజా వర్షాలకు ఆ చెరువు మట్టి బురదమయంగా మారడంతో వాహనచోదకులు పల్టీలు కొడుతున్నారు. వాహనాలు జారిపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. ఇక్కడ పడిన గోతులకు శాశ్వత మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏ మాత్రం వర్షం పడినా ఎన్టీపీసీ–బొట్టవానిపాలెం రహదారి మరీ దారుణంగా ఉంటోంది. ఆ సమయంలో ఈ రోడ్డుపై రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నామని ఎన్టీపీసీ కార్మికులు, రైతులు వాపోతున్నారు. మట్టి రోడ్డు కావడంతో వర్షాలకు బురదగా మారుతోంది. దీంతో రాకపోకలు సాగించడం కష్టంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొడుకును చూసేందుకు వెళ్తూ.. అనంత లోకాలకు..

- లారీ ఢీకొని ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న తల్లి మృతి
- స్వల్ప గాయాలతో బయటపడ్డ తండ్రి



విజయలక్ష్మి(ఫైల్)



ప్రమాద స్థలిలో విజయలక్ష్మి మృతదేహం

సబ్బవరం: ఓ ప్రైవేట్ స్కూల్ హాస్టల్లో ఉండి చదువుకుంటున్న కుమారుడిని చూసేందుకు వెళ్తున్న తల్లిదండ్రులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో తల్లి అక్కడికక్కడే మరణించగా, తండ్రి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై చిన్నయ్యపాలెం జంక్షన్ దరి బ్రిడ్జి వద్ద ఆదివారం ఈ దుర్ఘటన జరిగింది. స్థానిక సీఐ జి.రామచంద్రరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కశింకోట మండలంలోని తీడ గ్రామానికి చెందిన దుంగల విజయలక్ష్మి తన భర్త శ్రీనివాసరావుతో కలిసి తగరపువలసలోని ఓ ప్రైవేట్ స్కూల్లో చదువుతున్న కుమారుడి వద్దకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. హైవేపై వస్తున్న వీరు సబ్బవరంలోని చిన్నయ్యపాలెం సమీపంలోకి వచ్చే సరికి అదే మార్గంలో మిర్యాలగూడ నుంచి ఒడిశా వెళ్తున్న ఓ లారీ వెనుక నుంచి ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న విజయలక్ష్మి రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందగా, భర్త స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు పేర్కొన్నారు.

ఘనంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు



దేవీపురంలో దివ్య అలంకరణలో వారాహి అమ్మవారు



పల్లకీ సేవలో పాల్గొన్న చిన్నారులు, భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు ఆదివారం శ్రీమేరు మొదటి అంతస్తులో కొలువైన ఉత్సవమూర్తి వారాహి అమ్మవారికి క్షీరాభిషేకం, షోడశోపచార సహిత కుంకుమ పూజలు నిర్వహించారు. వారాహిమాత యంత్ర ముద్రిత బహు కాసులు, నూతన వస్త్రాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మాతను పల్లకీలో ఆశీనురాలిని చేసి నవవర్ణ పుష్పాలతో ఆలంకరించి ఊరేగించారు. మేళ తాళాలతో ఆహూతులైన అనేకమంది భక్తులు, అమృత కన్యా గురుకులం విద్యార్థినులు కోలాటాలతో సందడి చేశారు. రాత్రికి తిరస్కరణీ వారాహి హోమం జరిపారు. ఈ హోమం ద్వారా మాయా భ్రాంతుల తొలగింపుతోపాటు, ప్రతికూల శక్తుల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. మధ్యాహ్నం గురుమాత అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా అన్నసమారాధన జరిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1999-2000 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

పెందుర్తి: దాదాపు రెండున్నర దశాబ్దాల తరువాత వారంతా కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. సరదాగా కబుర్లు చెప్పుకున్నారు. అంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1999–2000 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని, ప్రస్తుత స్థితిగతులను చెప్పుకున్నారు. పాఠశాల ఆవరణలో సాయంత్రం వరకు సందడిగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను సత్కరించి, ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. తీపి జ్ఞాపకాలతో వీడ్కోలు తీసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: దారపాలెం 11 కేవీ ఫీడర్ పరిధి లో నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్న ట్లు విద్యుత్‌శాఖ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. దీంతో అడవివరంలోని కుమ్మరిదిబ్బ, పాత అడవివరం జంక్షన్, దారపాలెం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫ ఉండబోదన్నారు. విని యోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–2 అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధి 33/11 కేవీ నిర్వహణ పనుల్లో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, బోదువలస, అయ్యన్నపాలెం, వంగలి, రాయపుర అగ్రహారం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, ఆరిపాక, గొటివాడ, పెదయాతపాలెం, బంగారమ్మపాలెం, అడ్డూరు, ఎల్లుప్పి, లగిశెట్టిపాలెం, గాలిభీమవరం, చినయాతపాలెం, కిల్లివానిపాలెం గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.